క్లుప్తంగా

రంగస్థల కళాకారుడు కోటేశ్వరరావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం శ్రీ తిరుపతి వేంకటేశ్వర కళ్యాణం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం శ్రీ మద్విరాటపర్వం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థల కళాకారుడు దేశబోయిన కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్లు రాజా, జోగి మహేందర్, వరికుంట్ల కిరణ్, ఆలూరి నరసయ్య, కల్లు రాజేష్, శెట్టి చంద్రబాబు, కల్లు జాన్‌బాబు, ఆరాధ్యుల ఆదినారాయణ, బొంతా కోటేశ్వరరావు, దాసరి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో మెరుగైన సేవలు



తెనాలి: కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చూస్తామని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. గీతాంజలి శర్మ కేక్ కట్ చేశారు. కార్యాలయం ఉద్యోగులు, డివిజను పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు సబ్ కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బి.వెంకటేశ్వర్లు, డీటీ ఎంవీఎస్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్వరీ, హనీ ప్రియ, పద్మశేషు, డీఐ ఆఫ్ సర్వే కోటిరెడ్డి, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి, సీసీలు నరేంద్ర, వరప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ




తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ గుంటూరు, కృష్ణాజిల్లాల అధ్యక్షుడు జలగం రామకృష్ణ, తెనాలి పట్టణ రజక సంఘం అధ్యక్షుడు పెసర్లంక రమణ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. గంగానమ్మ పేటలోని వైఎస్సార్ సీపీ తెనాలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

తెనాలిఅర్బన్: మున్సిపాలిటీలోని 16వ వార్డులో నూతనంగా మంజూరు అయిన 17 పింఛన్లను వార్డు సచివాలయంలో సోమవారం చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ పంపిణీ చేశారు. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున పింఛన్లను పంపిణీ చేస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో 16వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కాళిదాసు విజయ, సచివాలయ కన్వీనర్లు కాళిదాసు సత్యం, యనమద్రి శ్రీధర్, డి.శ్రీధర్, రామలింగేశ్వరరావు, నాగేశ్వరరావు, కోలా వాసు, శాంతకుమారి, సతీష్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ



తెనాలిటౌన్: గాంధీ నగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు సహకారంతో వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, పసుపులేటి సావిత్రి, జ్యోతి, భవాని, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సుజాత, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు. తొలుతగా వృద్ధులతో కేక్ కట్ చేయించారు.

వలంటీర్లకు నియామక పత్రాలు

కర్లపాలెం: గ్రామ వాలంటీర్లు అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎంపీపీ యారం వనజ తెలిపారు. కర్లపాలెం మండల పరిధిలో నూతనంగా వలంటీర్లుగా నియమితులైన వారికి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ, ఎంపీడీఓ ఎలీషాబాబులు నియామక పత్రాలందజేశారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు



శ్రీ మహావిష్ణువు అలంకరణలో స్వామివారు



శ్రీ విద్యాపీఠంలో.. అలంకరణలో అమ్మవారు



ఎమ్మెల్యే శివకుమార్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో తిమ్మానాయుడు



బారులు తీరిన భక్తులు



పూజలు చేస్తున్న రామానుజదాసస్వామి

- భక్తులతో కిటకిటలాడిన వైకుంఠపురం దేవస్థానం
- తెల్లవారుజామున పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్
- స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

తెనాలిటౌన్: వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) వేడుకలను ప్రజలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి ఉత్తర ద్వారా దర్శనం తెల్లవారుజాము 4గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు భక్తులకు కల్పించారు. బంగారు శంకుతీర్థం అందించారు. స్వామివారు భక్తులకు మహా విష్ణువు రూపంలో దర్శనమిచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెల్లవారు జాము నాలుగు గంటలకు స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పూజలు జరిపారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ గౌతమ, అళహరి రవికుమార్ ప్రత్యేక పూజలు జరిపి హారతి ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని ఈవో తిమ్మానాయుడు ఎమ్మెల్యే శివకుమార్‌కు అందజేశారు. స్వామి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. క్యూలైన్‌లో నిలబడి దర్శనం చేసుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, పోలీసు అధికారులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.



పూజలు చేస్తున్న బాలస్వామిజీ, భక్తులు

- చెంచుపేట అమరావతి కాలనీలోని శ్రీ గోదా పద్మావతి దేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టణ వీధులలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాన్ని దేవస్థాన కార్యనిర్వహణ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- పట్టణ వీఎస్ఆర్ కాలేజ్ రోడ్‌లో జరుగుతున్న శ్రీ ధనుర్మాస వ్రత మహోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం ఐదు గంటల నుంచి రామానుజదాసస్వామి పర్యవేక్షణలో అభిషేకం, వైకుంఠ ఏకాదశ మహోత్సవం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు లక్ష్మి నారాయణ పూజను భక్తులు వైభవంగా జరిపారు. అనంతరం గాజుల శ్రీలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమాన్ని నరేంద్ర రామానుజదాసస్వామి, బసవేశ్వరరావు, తీన్నరు సీతారామయ్య, వి.వాలేశ్వరరావులు పర్యవేక్షించారు.
- గంగానమ్మపేటలో శ్రీ విద్యాపీఠంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా పూజ్య శ్రీ బాల స్వామిజీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వైకుంఠ శ్రీనివాసస్వామి ముక్కోటి దేవతలు వైకుంఠ ద్వారం నందు విశేష అర్చన కైంకర్యం నిర్వహించారు. భక్తులకు బంగారు శంకుతీర్థం అందించారు. ఉభయదాతలు పూజలు నిర్వహించారు. శ్రీ విద్యాపీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ కవి సమ్మేళనానికి ఎంవీ రామిరెడ్డి ఎంపిక



తాడికొండ: ఆకాశవాణి ఏటా నిర్వహించే జాతీయ కవి సమ్మేళనానికి 2023 ఏడాదికి గుంటూరు జిల్లా పెదపరిమి గ్రామానికి చెందిన ఎంవీ రామిరెడ్డి తెలుగు భాష నుంచి ఎంపికయ్యారు. భారతీయ భాషలకు సంబంధించి 23 మంది కవుల కవితలను ఆకాశవాణి ఈ నెల 10వ తేదీన ఢిల్లీలోని రంగ్ భవన్‌లో రికార్డు చేయనుంది. స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎంవీ రామిరెడ్డి రాసిన అమృతోపనిషత్ కవితను తెలుగు భాష నుంచి ఎంపిక చేశారు. ఈ కవితను అన్ని భారతీయ భాషల్లోకి అనువదించి ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారం చేయనున్నారు. కవిగా, కథా రచయితగా ఎంవీ రామిరెడ్డి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటి దాకా 3 కథా సంపుటాలు, 4 కవితా సంపుటాలు ప్రచురించారు. ప్రస్తుతం రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్‌గా, హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఆయన తన స్వగ్రామమైన గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం పెదపరిమిలో తండ్రి స్మారకంగా ముప్పా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా నిర్మించిన భవనంలో వృద్ధాలయంతో పాటు నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు.

నృసింహుని సన్నిధిలో డీఐజీ అమ్మిరెడ్డి

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామిని డీఐజీ అమ్మిరెడ్డి దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం ఆలయానికి విచ్చేసిన డీఐజీకి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ డీఎస్పీ జె.రాంబాబు, సీఐ అంకమ్మరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు

ఆచార్య నాగార్జున, కృష్ణ విశ్వవిద్యాలయాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరు



మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు ఉమామహేశ్వరరావు

పిట్టలవానిపాలెం: మండలంలోని కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాలలో సోమవారం మంతెర వెంకటరాజు ఫౌండేషన్ సౌజన్యంతో ఆచార్య నాగార్జున, కృష్ణా విశ్వవిద్యాలయాల అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు విద్యతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని మంచి వక్తలుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ తలశిల శివప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున, కృష్ణా విశ్వవిద్యాలయాల పరిధిలో 45 కళాశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కళాశాల పాలక మండలి సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాస కుమార్, పాలక మండలి ఉపాధ్యక్షుడు మంతెన వెంకట శివరామరాజు, జాయింట్‌సెక్రటరీ ఎం.కృష్ణంరాజు,అధ్యాపకులు ఉన్నారు.

విజేతలు వీరే...

వక్తృత్వం పోటీలలో మొదటి బహుమతి చీరాల చైతన్యభారతి డిగ్రీ కళాశాలకు చెందిన జి.శివవాణీప్రసాద్‌కు రూ.5 వేలు, ప్రశంసా పత్రం, ద్వితీయ బహుమతిని తాడికొండ గోగినేని కనకయ్య ఓరియంటల్ కాలేజి విద్యార్థి పి.రూప్ల నాయక్‌కు రూ.3వేలు, ప్రశంసా పత్రం, తృతీయ బహుమతిని బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలకు చెందిన సీహెచ్ భార్గవికి రూ.2 వేలు ప్రశంసాపత్రాలను అందజేశారు. వ్యాసరచనలో మొదటి బహుమతిని నాగార్జున సాగర్ ఏపీ రెసిడెన్షియల్ కాలేజీకి చెందిన పి.రవిప్రసాద్ రూ. 5 వేలు, ప్రశంసా పత్రం, ద్వితీయ బహుమతిని తెనాలి జేఎంజే కాలేజీ ఫర్ ఉమెన్ కళాశాలకు చెందిన కె.సింధుకు రూ.3 వేలు, ప్రశంసాపత్రం, తృతీయ బహుమతిని గుంటూరు చిప్స్ కాలేజీకి చెందిన సీహెచ్ హర్షవర్ధన్‌కు రూ.2 వేలు, ప్రశంసాపత్రంను అందజేశారు.

రోగులకు అల్పాహారం పంపిణీ



తెనాలిఅర్బన్: కటకంశెట్టి వీరయ్య 20వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు కటకంశెట్టి ఏడుకొండలు జిల్లా వైద్యశాలలోని రోగులకు, వారి బంధువులకు అల్పాహారాన్ని సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కటకంశెట్టి శ్రీనివాసరావు, నంద, సుబ్బారావు, రజినీకాంత్, లక్ష్మణుడు, గంగాధర్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, వస్త్రాల పంపిణీ



తెనాలి: పట్టణ పరిసరాల్లోని సంచార తెగల ప్రజలకు ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బియ్యం, నూతన వస్త్రాలు, పిల్లలకు బిస్కట్లు అందించారు. మేనేజింగ్ ట్రస్టీ, చైర్‌పర్సన్ అంజలి రావూరి తన భర్త సురేష్‌బాబుతో కలిసి సోమవారం వాటిని పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరం సందర్భంగా షెడ్యూలు జాతులు, సంచార తెగల ప్రజలకు సేవలు అందించేందుకు.. పట్టణంలోని అయితానగర్‌లో ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఊరూరా తిరుగుతూ.. సంచార జాతులుగా మిగిలిపోయిన పేదలకు పౌష్టికాహారం, వస్త్రాలు ట్రస్ట్ ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అద్దంకి పద్మ, బొంత కృపమ్మ పాల్గొన్నారు.

అంతుపట్టని వ్యాధితో మంచానికే పరిమితం

- తమ ముగ్గురు కుమారుల దుస్థితి చూసి కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు
- పరామర్శించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



ముగ్గురు యువకులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న కేసన శంకరరావు

నిజాంపట్నం: అంతుపట్టని వ్యాధితో రోజురోజుకీ ఆరోగ్యం క్షీణిస్తున్న ముగ్గురు యువకులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. నిజాంపట్నం మండలంలోని అడవులదీవి పంచాయతీ పల్లెపాలెం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ సత్యన్నారాయణ, వెంకటరమణ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరు అంతుపట్టని వ్యాధితో సుమారు 14 సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయాన్ని తెలుసుకున్న కేసన శంకరరావు ఆ ముగ్గురు యువకులను సోమవారం పరామర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తండ్రి సత్యన్నారాయణ సమస్యను వివరించారు. 23, 21, 19 ఏళ్ల కలిగిన తన ముగ్గురు కుమారులు చరణ్‌కుమార్, కిరణ్‌కుమార్, నితిన్ కుమార్‌లు పుట్టినప్పటినుంచీ ఒక్కొక్కరికీ 8 సంవత్సరాలు వచ్చే వరకూ ఎలాంటి ఆరోగ్య పరమైన సమస్యలు లేవని తెలిపారు. వారిలో ప్రతి ఒక్కరికీ 9వ సంవత్సరం నుంచి బోన్ పరమైన సమస్యలు తలెత్తడం వల్ల ముగ్గురూ మంచానికే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో వైద్యశాలలకు తిప్పినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ముగ్గురినీ ఇంట్లోనే ఉంచుకుని వారి ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. తమ పిల్లల ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు క్షీణించి పోతుండటంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉండిపోయామని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పెద్దకుమారుడి ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కేసన శంకరరావు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఆ కుటుంబానికి బీసీ సంక్షేమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట బీసీ సంఘ నాయకుడు కొపనాతి నాగబాబు తదితరులు ఉన్నారు.

గాయత్రి అమ్మవారి ఉత్తర ద్వార దర్శనం



అమ్మవారి ఉత్తరద్వార దర్శనంలో పరిషత్ నేతలు

తెనాలి: తెనాలి బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పరిషత్ కార్యాలయంలో గాయత్రి అమ్మవారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ప్రముఖ పండితుడు బ్రహ్మశ్రీ రావూరు హర్ష పూజాకార్యక్రమాలు చేశారు. భక్తులు తరలి వచ్చి విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు దక్షిణావృత శంఖు తీర్థం పంపిణీ చేశారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ మాట్లాడుతూ.. గాయత్రి అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ ఉత్తరద్వార దర్శనం ఏర్పాటుచేసి, ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు. పరిషత్ కోశాధికారి వడ్లమాని ఉమామహేశ్వరరావు, జ్యోతి దంపతులు తొలి పూజలో పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్కరాజు లక్ష్మణరావు, త్రిపురారిభట్ల దత్తాత్రేయశాస్త్రి, చెన్నా ప్రగడ శ్రీనివాస్, దావులూరి శ్యామ్ సుందర్ శర్మ, పుచ్చా శాస్త్రి, దీవి జీవన్, గొర్తి అన్నపూర్ణయ శాస్త్రి, దీవి శ్రీనవాసాచార్యులు, పులిగడ్డ సుధాకర్, మాగంటి రత్నాకరశాస్త్రి, పులిగడ్డ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

7నుంచి టీపీఎల్ సీజన్-6 క్రికెట్ పోటీలు

బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్



తెనాలి: యువ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో తెనాలి ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) సీజన్-6 బ్రోచర్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన స్థానిక తాలూకా జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో ప్రారంభమయ్యే పోటీలు 10 రోజులపాటు జరుగుతాయని యువ క్రికెట్ అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్, కోచ్ షేక్ మాలిక్ చెప్పారు. రెండు విభాగాల్లో టెన్నిస్ బాల్, లెదర్ బాల్‌తో జరిగే ఈ పోటీల్లో లెవల్-1లో గెలుపొందిన జట్టుకు రూ.16 వేలు, రూ.8 వేలు ప్రైజ్‌మనీగా తెలియజేశారు. తెనాలి పేరుతో జరుగుతున్న క్రికెట్ పోటీలు, క్రీడా రంగంలో పట్టణానికి మరింత ఖ్యాతిని తెచ్చేలా ఉండాలని ఎమ్మెల్యే శివకుమార్ సూచించారు. గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అడుసుమల్లి శ్రీనివాస్, అక్కిదాసు కిరణ్‌కుమార్, షేక్ మీరావలి, బక్క శివకృష్ణ, షేక్ బాబర్, జ్యోతుల శ్రీనివాస్, భరత్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

శేషపాన్పుపై దర్శనమిచ్చిన కోదండరామస్వామి



లక్ష్మీసమేతంగా స్వామివారి విశేషాలంకారం

తెనాలి: పట్టణంలోని మారీసుపేటలో ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానం (శ్రీరామభక్త అప్పలస్వామి గుడి)లో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని స్వామివారు 'శేష పాన్పుపై లక్ష్మీసమేతంగా' విశేష అలంకరణతో భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. విష్ణుభట్ల ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీ సుదర్శన హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ లంక శివానంద్ కుమార్ మాట్లాడుతూ ఆలయంలో ధనుర్మాస పూజలను విశేషంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయంలో ఈ ఏడాదిలో నిర్వహించే పండుగలన్నింటిలోనూ భక్తులను కూడా భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. ఆలయ కోశాధికారి కూనపల్లి నారాయణస్వామి, భక్తులు పాల్గొన్నారు.

పింఛన్‌పై దుష్ప్రచారాలు నమ్మొద్దు



నూతన పింఛన్‌దారులతో వైస్ చైర్మన్ కోటేశ్వరరావు

తెనాలిఅర్బన్: పింఛన్ల పంపిణీపై వస్తున్న దుష్ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు పేర్కొన్నారు. 15వ వార్డులో నూతనంగా మంజూరైన 15 పింఛన్లను సోమవారం రామలింగేశ్వర పేటలోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వార్డులో 15 మంది పింఛన్‌దారులకు వలంటీర్లు నోటీసులు జారీ చేశారని గుర్తు చేశారు. వారిలో ఎనిమిది మంది సరైన ధృవపత్రాలు అందజేయడంతో యాథావిధిగా పింఛన్ అందజేశామని చెప్పారు. మిగిలినవి కూడా కొద్ది రోజుల్లో పంపిణీ చేస్తామనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి బత్తుల సుబ్రమణ్యం, సుంకర కొండలరావు, మేడేపల్లి ప్రభాకర్, ఎస్.వెంకట్రావు, షేక్ కౌసర్, కాజా, మన్నేపల్లి ఆదిశేషగిరిరావు, బోడపాటి శివకృష్ణ, వాసిరెడ్డి కళ్యాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

రేపల్లె: బాలికా విద్యకై సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. పట్టణంలోని శారద ఐటీఐ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సావిత్రిబాయ్ పూలే జయంతి ఉత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోనే ప్రథమ మహిళా ఉపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టి బాలికలు, మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దారన్నారు. సావిత్రీబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకట నారాయణ, బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ కొప్పనాతి నాగబాబు, సభ్యులు యేమినేని యానాదిరావు, మండే ప్రసాద్, మేరుగు నాగేశ్వరరావు, అన్నం హరీష్, సుధ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన షిర్డీ సాయిబాబా జయంతి వార్షికోత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో 78వ జయంతి వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబావారికి ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, కాగడ హారతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీజీజీబీ మేనేజర్ ఆర్.సురేష్ జ్యోతి ప్రజ్వలన చేయగా, ఆలయ కమిటీ నిర్వాహకులు మాటూరు రామకృష్ణ ఉమాశంకర్ పతాకావిష్కరణ చేశారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు పర్యవేక్షించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

కొల్లూరు: భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదన్న మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఈపూరుకు చెందిన సీదర్ల కార్తిక్ (24) మూడేళ్ల క్రితం నంబూరుకు చెందిన మరియ జ్యోతిని వివాహం చేసుకున్నాడు. అతని భార్య పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుండటంతో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు నిర్వహించి.. ఇంటికి తీసుకువచ్చాడు. అయినప్పటికీ భార్య పదేపదే పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుండటంతో మనస్థాపానికి గురయ్యాడు. గత నెల 15న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో గమనించిన బంధువులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న అతను పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన నివేదిక ఆధారంగా సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అడ్మిషన్ పొందాలి

నిజాంపట్నం: ఐటీఐ కోర్సులు పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు బ్రిడ్జి కోర్సును నిర్వహించడం జరుగుతుందని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకరబాబు తెలిపారు. బ్రిడ్జి కోర్సు ఈ నెల 9 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు.